క్లుప్తంగా

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



రాజోళి: వడ్డేపల్లి మండలం కొంకలలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం టీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు గళ్ల, రక్త, బీపీ, ఛాతి పరీక్షలను వడ్డేపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్వహించారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న వారు వెంటనే ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. అనంతరం టీబీపై అవగాహన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు, డాక్టర్ సీహెచ్ లక్ష్మన్న, స్వర్ణలత, శాంతిశ్రీ,, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



గట్టు: మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో గురువారం గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొత్తం 441 గొర్రెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండల పశువైద్యాధికారి నవీన్‌చంద్ర మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు సీజనల్‌గా వచ్చే నీలినాలుక వ్యాధి టీకాలను వేయించాలని యజమానులకు సూచించారు. వ్యాధి సోకిన గొర్రెల్లో తీవ్రమైన జ్వరం, నోట్లో నాలుక వాచి చొంగ కారడం, మేత తినకుండా ఉండడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి, మందులు వాడితే అరికట్టువచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అధికారి పృధ్వీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఇటిక్యాల: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతా పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన మొదటి పరీక్షకు సంబంధించి అభ్యసన సామర్థ్యాలు ఏ విధంగా ఉన్నాయో అని పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎల్ఎఫ్‌పీ ప్యానల్ ఉపయోగించి ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్రానికి సంబంధించిన పాఠ్యాంశాల బోధన విధానంపై ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ జీహెచ్‌ఎం పాగుంటన్న, ఆర్పీలు రజినికుమార్, రవి, శంకర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత.. తీరని చింత



అమరచింత: పట్టణంలో నిర్వహించే వారాంతపు సంతకు ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో రహదారిపైనే సంతను నిర్వహించుకునే దుస్థితి నెలకొంది. తహసీల్దార్ కార్యాలయం రాహదారికి ఇరువైపులా విక్రయదారులు, రైతులు కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. సాయంత్రం వాహనాలతో పాటు అన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులు, ఆటోలు ఇదే రహదారిలో వెళ్తుడటంతో ట్రాఫిక్ జాం అవుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు. సంత నిర్వహించేందుకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయని మున్సిపల్ అధికారులు విక్రయదారుల నుంచి తైబజార్ వసూలు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుట్టెడు సమస్యల్లో గురుకులం

- శిథిలావస్థకు చేరిన డార్మిటరీ గదులు
- మౌలిక సదుపాయాలు లేక అవస్థలు
- శాపంగా మారిన నీటి సమస్య

ఎర్రవల్లి: ప్రతిభ గల నిరుపేద విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం గురుకుల విద్యాలయాలను స్థాపించింది. కానీ బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. రోజుల తరబడి నీటి సమస్య వెంటాడుతుందని వాపోతున్నారు.

శిథిలావస్థకు చేరిన డార్మిటరీ గదులు

బీచుపల్లి గురుకుల పాఠశాలను 1983లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. విద్యార్థులకు అవసరమైన పూర్తి మౌలిక వసతులతో పాఠశాల, డార్మిటరీ, వంటశాల, డైనింగ్ హాలు వంటి భవనాలను నిర్మించింది. 5వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం 640 మంది వరకు విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో డార్మిటరీ గదిలో 80 మంది విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ ఉంటున్నారు.



బీచుపల్లి గురుకుల పాఠశాల భవనం



80 మంది విద్యార్థులు ఒకేచోట బసచేస్తున్న డార్మిటరీ

గదుల్లోకి వర్షపు నీరు

వర్షాకాలం ప్రారంభమవడంతో కొన్ని డార్మిటరీలు వర్షపు నీటితో లీకేజీ అవుతున్నాయి. లైట్లు, ఫ్యాన్లు, కిటికీలు సైతం సక్రమంగా లేకపోడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఈగలు, దోమలతో పాటు విషపురుగులు సైతం సంచరిస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా నీటి సమస్య

పాఠశాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇప్పటి వరకు దాదాపు 12 బోర్లు వేసినా చుక్క నీటిజాడ దొరకలేదు. మిషన్ భగీరథ పథకం ద్వారానే నీరు వస్తుంది. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజైతే మరమ్మతు చేపట్టే వరకు పాఠశాలకు నీటి చుక్క రాదు. దీంతో విద్యార్థులు స్నానం చేయకుండానే పాఠశాలకు వెళ్లిన రోజులు కూడా చాలానే ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు 500 మీటర్ల దూరంలోనే కృష్ణానది ఉంది కానీ పాఠశాలలో నీటి సమస్య వేధిస్తుంది.

క్రీడా మైదానం కరువు

పాఠశాలకు కేటాయించిన భూమిలో తొమ్మిది ఎకరాల్లో పెద్దగుట్ట ఉండటంతో నిరుపయోగంగా ఉంది. పలుమార్లు కలెక్టర్, ఎమ్మెల్యే తదితర అధికారులు సైతం గురుకుల పాఠశాలను సందర్శించి క్రీడా మైదానం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గురుకులంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న 9 ఎకరాల పాఠశాల స్థలం

భయంతో గడపాల్సి వస్తుంది



డార్మిటరీలను నిర్మించి దాదాపు నాలుగు దశాబ్దాలు కావడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి పడుతుంది. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని డార్మిటరీల్లో గడపాల్సి వస్తుంది. నీటి సమస్య కూడా రోజుల తరబడి ఉంటుంది.

\- రిషి, పదో తరగతి

క్రీడా స్థలం లేదు



ఆడుకునేందుకు ఆట స్థలం కరువైంది. పాఠశాల సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో సాయంత్రం వేళల్లో వివిధ క్రీడలను ప్లాట్లకు పాతిన రాళ్ల మధ్యన ఇబ్బందులు పడుతూ ఆడుకుంటున్నాం. పాఠశాల పక్కనే దాదాపు 9 ఎకరాల భూమి గుట్టగా ఉండి వృథాగా ఉంది.

\- నరేష్‌గౌడ్, సీనియర్ ఇంటర్

ఉన్నతాధికారులకు విన్నవించాం



పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించాం. నీటి సమస్య ఎదురైనపుడు ట్యాంకర్ల నీటిని అందిస్తున్నాం. అరకొర నిధులతో పాఠశాలలో మరమ్మతు చేపడుతున్నాం.

\- శ్రీనివాస్, ప్రిన్సిపాల్

సుప్రీంకోర్టు తీర్పుతో కనువిప్పు

గద్వాల: పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి కనువిప్పు కావాలని బీఆర్ఎస్ నాయకుడు కురువ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుపై మూడు నెలలలోపు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించడం ప్రజాస్వామ్యాన్ని కాపాడే తీర్పు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధపడాలన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలుపొంది పార్టీ ఫిరాయించడం సిగ్గుచేటని ఆయనకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే తన పదవికి రాజీనామా చేసి ప్రజా తీర్పుకు రావాలని డిమాండ్ చేశారు. అదే విధంగా స్పీకర్ ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా స్వతంత్రంగా వ్యవహరించి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ప్రమాదకర కల్వర్టు పట్టించుకోండి సారూ..

అయిజ: మండలంలోని కేశవరం గ్రామ సమీపంలో కల్వర్టుకు సంబంధించిన సేఫ్టీవాల్ (రక్షణ గోడ) ఇటీవల పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కల్వర్టుపై ప్రయాణమంటేనే వాహనదారులు భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కాంప్లెక్స్ సమావేశాలు సద్వినియోగించుకోవాలి

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో సోషల్ సబ్జెక్ట్‌పై స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఉపాధ్యాయులు అందరూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోవడానికి సమావేశాలు ఉపయోగపడుతాయన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని ఉత్తమ విద్యా బోధన ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను తయారుచేయడంలో ఉపాధ్యాయులు పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలి

గట్టు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి కోరారు. గురువారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో బీజేపీ బూత్ బైటక్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఉచిత బియ్యం, సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, టాయిలెట్స్, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే నిధులు, ముద్రలోన్లు, పీఎం విశ్వకర్మ, రైతువేదికల నిర్మాణం, వైకుంఠదామాలు, పల్లెప్రకృతి వనాలు, ఎరువుల రాయితీ తదితర పథకాల గురించి తెలియజేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో బీజేపీ పార్టీకి కనీసం 51 శాతం ఓట్లు సాధించే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు బల్గెర శివారెడ్డి, సోమన్న, బ్రహ్మయ్య, బసప్ప, మహేస్, బోయ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

పేకాట స్థావరంపై దాడి

అయిజ: మండలంలోని బింగుదొడ్డి శివారులో గురువారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 7 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.12,200 నగదు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

మల్దకల్: గర్భిణులు, బాలింతలు నెలనెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ జయమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని సూచించారు. పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపిక



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గురుకుల బాలికల పాఠశాలకు చెందిన నలుగురు 8వ తరగతి విద్యార్థులు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికకావడంపై విద్యార్థులు శివాని, దీప్తి, మేఘన;' ఊహలను ప్రిన్సిపాల్ దేవానందం అభినందించారు. ఆగస్టు 4న రంగారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పటాన్‌చెర్వులో నిర్వహించే యూఓఈలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మెలగాలి

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో మెలగాలని కర్ణాటక పీఠాధిపతి మరిహుచ్చేశ్వర స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత నైపుణ్యాలు పెంచుకుంటనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోగలరని పీయూ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఏసీఏసీపీ బ్యాంక్ కోసం రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల కోసం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ అర్హత డిగ్రీతోపాటు పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్, కంప్యూటర్, ఇంగ్లీస్ వంటి వ్యాటిపై పట్టు సాధిస్తే సులువుగా ఉద్యోగం సాధించేందుకు అవాకశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పీయూలో చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందడం గొప్ప విషయమని చెప్పారు. కార్యక్రమంలో టీపీఎస్ హెచ్‌ఆర్ కిరణ్, అధ్యాపకులు రాజ్‌కుమార్, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

గద్వాల: పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పెండింగులో ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలంటూ కృష్ణవేణి చౌరస్తాలో నిరసన జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తవుతున్నా ఇప్పటి వరకు కాలేజీలకు చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిపులు విడుదల చేయకుండా వివక్ష చూపుతుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు ఉన్నత విద్యకు చదవాలంటే ముందస్తు ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొనడం బాధకరమన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరోవైపు కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశ విద్యా రంగం కార్పొరేట్ మయం అవుతుందన్నారు. వచ్చిన వంద రోజుల్లోనే రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. విద్యా రంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని మోసం చేసినట్లు మండిపడ్డారు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 10 పాస్ అయితే రూ.వెయ్యి, ఇంటర్‌పాస్ అయితే రూ.15 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.25 వేలు, పీజీ పాస్ అయితే రూ.1 లక్ష, పీహెచ్‌డీ వాళ్లకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పిన హామీలు గాలిలో కలిసిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థుల మెస్ కాస్మోటిక్ చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచకపోవడంతో విద్యారంగంపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతుందన్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపు బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజ్, మాధవ్, చిన్న, జాంగీర్, అఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని పంచాయతీ కార్యదర్శి తిరుమలేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎస్ఐ ఈశ్వరయ్య, ఆర్‌ఐ మద్దిలేటి హాజరై పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని అవలంభించడం, కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కులమతాలకు అతీతంగా కలసి మెలసి జీవించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్ఐ ఈశ్వరయ్య

కొత్త సత్రంలో భక్తులకు అన్న ప్రసాదం



కొత్త అన్నదాన సత్రంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- అన్నదాన సత్రంలో ముగిసిన పూజలు

అలంపూర్: జోగులాంబ అమ్మవారి క్షేత్రంలోని కొత్త అన్నదాన సత్రంలో రెండు రోజులుగా నిర్వహించిన పూజలు ముగిశాయి. రెండో రోజు గురువారం ప్రసాద్ స్కీంలోని ఒక బ్లాక్‌లో శ్రీ బాల బ్రహ్మేశ్వరస్వామి అన్నదాన సత్రం అందుబాటులోకి తెచ్చారు. కొత్త అన్నదాన సత్రంలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4.34 గో సహిత గృహ ప్రవేశం, గోసహిత ప్రదక్షణలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే విజయుడు వేరువేరుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్త నిత్య అన్నదాన సత్రంలో పూజలు చేసి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఆదిదంపతులైన శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు కనులపండవగా నిర్వహించారు. పూజల తర్వాత రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు భక్తులకు భోజనాలు వడ్డించి సత్రాన్ని ప్రారంభించారు. భక్తులతో కలిసి వారు సహాపంక్తి భోజనం చేశారు. సాయంత్రం మంత్రి వాకిటి శ్రీహరి సతీసమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, ధర్మకర్తలు నాగశిరోమణి, సరస్వతి, చంద్రశేఖర్‌రెడ్డి, జయరాముడు, జగన్‌మోహన్ నాయుడు, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, గోపాల్, సురేంద్రస్వామి, వెంకటేశ్వర్లు, పులేందర్, ఎక్స్ అఫీషియో సభ్యులు, ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో ఆది దంపతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మంత్రిని సన్మానించిన నాయకులు

ఎర్రవల్లి: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల సందర్శనకు వెళ్తున్న మంత్రికి పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి కూడలిలో ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, దొడ్డెప్ప, కుమార్, నారాయణనాయుడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం

- ఇబ్బందులు పడుతున్న రైతులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. వ్యవసాయ పొలాల పక్కన, రోడ్లకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, రైతులు భయాందోళనలో ఉన్నారు. రక్షణ కంచె కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

రోడ్డుకు సమీపంలో

అమరవాయి, మల్దకల్, బిజ్వారం, తాటికుంట, నాగర్‌దొడ్డి, నీలిపల్లి గ్రామాల్లో రోడ్డుకు సమీపం, ఇళ్ల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా అమరవాయి, బిజ్వారం, మల్దకల్ గ్రామ ప్రధాన రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఆందోళనలో ఉన్నారు. చిన్న ప్రమాదం సంభవించినా సరే ప్రాణాలు పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిజ– గద్వాల ప్రధాన రహదారిలోని అమరవాయి చింతలమునిస్వామి ఆలయ సమీపంలో రోడ్డుకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మరు ఉండటంతో వ్యవసాయ పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గోవిందు అనే వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అదే విధంగా ఓ రైతుకి చెందిన పశువులు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాయి. అమరవాయి నుంచి బిజ్వారం గ్రామానికి వెళ్లే రహదారిలో ట్రాన్స్‌ఫార్మరు రోడ్డు పక్కన ఉండటంతో రోడ్డుపై వెళ్లే వాహనాలకు తీగలు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోయారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్నట్లు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, కిందకు వేలాడుతున్న తీగలు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అమరవాయి వద్ద రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ కంచె నిర్మించాలి

రోడ్డుకు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న విద్యుత్ తీగలు సరిచేయాలి.

\- ఈదన్న, పాల్వాయి